ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

ఆదివారం 25 ఫిబ్రవరి 2024

ఇంటర్ ప్రశ్న పత్రాలు వచ్చేశాయ్!

వికారాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు శనివారం వికారాబాద్ జిల్లాకు వచ్చాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాలతో పాటు ఇతర మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిపాజిట్ సెంటర్లలో వాటిని భద్రపరిచారు. ఇంటర్ పరీక్షలకు మూడుసెట్ల ప్రశ్నపత్రాలు వినియోగించనున్నారు. డ్రా పద్ధతిలో ఎంపిక చేసే కోడ్ ప్రశ్నపత్రాలను విద్యార్థులకు ఇస్తారు.



ఇబ్రహీంపూర్‌లో మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న ఆనంద్‌రావు

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

● క్షేత్రస్థాయిలో తవ్వకాలను పరిశీలించిన తహసీల్దార్ ఆనంద్‌రావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరిగి,ఫిబ్రవరి 24: 'గుట్టలు కరిగి లోయలయ్యే.. పరిగిలో యథేచ్ఛగా మట్టి దందా'పై శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించారు. ఈ మేరకు పరిగి తహసీల్దార్ ఆనంద్ రావును విచారణ జరిపి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎస్ఐ సంతోష్, ఆర్ఐ చంద్రమోహన్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిగి మండలం ఇబ్రహీంపూర్, ఖుదావంద్ పూర్ తదితర ప్రాంతాలను పరిశీలించి విచారణ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా మట్టి దందా చేస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పరిగి మండలంలో మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు నివేదికను అందజేస్తామని తెలిపారు. ఎక్కడైనా మట్టి తవ్వకాలు జరిగితే సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

● ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి

కీసర, ఫిబ్రవరి24: వచ్చేనెల 6వ తేదీ నుంచి కీసరగుట్టలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి అన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం ఆయన కీసరగుట్టను సందర్శించి మాట్లాడారు. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగ కూడదన్నారు. ఉచిత, వీఐపీల క్యూలైన్లను ఆయన పరిశీలించారు. వాహనాల పార్కింగ్ కోసం అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై త్వరలో జిల్లా ఉన్నత అధికారులు సమీక్ష నిర్వహిస్తారని, ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకంనాగలింగం శర్మ, ఈవో నరేందర్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్‌పతి దీదీలు అంతంతే!

ఏడాదికి రూ.లక్ష వరకు ఆర్జిస్తున్న మహిళలు కొందరే!



కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ద్వారా రాష్ట్రంలో ఇటీవల సర్వే నిర్వహించింది. వివిధ స్వయం ఉపాధి వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటున్న పొదుపు సంఘాల మహిళల్లో ఏడాదికి అన్ని ఖర్చులూ పోను ఎంత ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని తెలుసుకోవడమే ఈ సర్వే లక్ష్యం. ఏటా రూ.లక్ష కంటే తక్కువ ఆదాయం ఉన్న సంఘాల సభ్యులను గుర్తించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'లక్‌పతి దీదీ' అనే పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. మహిళా పొదుపు సంఘాలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ఈ సర్వే నిర్వహించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 4,05,075 మంది పొదుపు సంఘాల మహిళలుండగా వారిలో 3,95,094 మంది ఈ సర్వేలో తమ అభిప్రాయాలను తెలియజేశారు. కాగా ఏడాదిలో లక్ష సంపాదన ఉన్న మహిళలు 24శాతం లోపే ఉన్నట్టు సర్వేలో వెల్లడైంది. ఇలాంటి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీ లేకుండా రూ.5లక్షల వరకు రుణం ఇవ్వడం, ప్రభుత్వ సంస్థల ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించడం వంటి ప్రోత్సాహకాలను కేంద్రం అమలు చేస్తోంది.



- మేడ్చల్‌లో 30శాతం
- వికారాబాద్‌లో 22శాతం
- రంగారెడ్డి జిల్లాలో 17శాతం ఉన్నట్లు గుర్తింపు
- జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ సర్వేలో వెల్లడి
- స్వయం సహాయక, పొందుపు సంఘాల సభ్యులపై పరిశోధన.. పేద మహిళలకు ఆర్థిక చేయూతే లక్ష్యం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 24): దేశంలో గ్రామీణ మహిళల ఆర్థికాభ్యున్నతికి కొత్తగా అమల్లోకి తెచ్చిన 'లక్‌పతి దీదీ' పథకాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ పథకం కింద పొదుపు సంఘాల మహిళలు ఏడాదికి అన్ని ఖర్చులు పోనూ రూ.లక్ష ఆదాయం సంపాదించేందుకు కేంద్రం ఆర్థిక సహాయంతో పాటు వారికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వనుంది. దేశంలో రెండు కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా చేసే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. పొదుపు సంఘాల మహిళలకు ఏటా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, తదితర పథకాల కింద ఉమ్మడి జిల్లాలో రూ.వందల కోట్ల రుణాలు అందచేస్తున్న విషయం తెలిసిందే. ఇలా రుణాలు తీసుకున్న మహిళలు వివిధ రకాల వ్యాపారులు చేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. అయితే ఈ పథకం అమల్లో భాగంగా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమిటి? వారి ఆర్థిగ ఎదుగుదల ఎలా ఉంది? పొదుపు సంఘాల్లో చేరిక ముందు, ఆ తరువాత వచ్చిన మార్పులు ఏమిటీ? ఆర్థిక సమస్యలను ఎలా పరిష్కరించుకుంటున్నారు? అనేది తెలుసుకునేందుకు ఇటీవల జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌సర్వే నిర్వహించింది. అలాగే ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన రుణాలతో ఎంత మంది మహిళలు లక్షాధికారులుగా మారారు? రుణాలు తీసుకున్న వారిలో ఆర్థికాభివృద్ధి సాధించని వారెందరు? ఇందుకు గలకారణాలు ఏమిటనేదానిపై సర్వే చేశారు. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో 4,05,075 మంది పొదుపు సంఘాల మహిళలు ఉండగా వీరిలో 3,95,094 మంది ఈ సర్వేలో పాల్గొన్నారు. అనేక అంశాలపై జరిగిన ఈ సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. కేంద్రం ప్రారంభించనున్న 'లక్‌పతి దీదీ' పథకం అమలుకు ముందే ఉమ్మడి జిల్లాలో పొదుపు సంఘాల ద్వారా లబ్ధిపొందిన 78,678మంది మహిళలు ఏడాదికి అన్ని ఖర్చులు పోనూ రూ.లక్షకుపైగా సంపాదిస్తున్నట్లు తేలింది. ఇక జిల్లాల వారీగా చూస్తే మేడ్చల్ జిల్లాలో 30శాతం మంది, వికారాబాద్ జిల్లాలో 22శాతం మంది, రంగారెడ్డి జిల్లాలో 17శాతం మంది 'లక్‌పతి దీదీ'లు ఉన్నారు. కాగా ఏడాదికి రూ.61వేల నుంచి రూ.లక్ష వరకు సంపాదిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది. లక్‌పతి దీదీల సంఖ్య రాష్ట్ర సగటు 24శాతం కాగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఇది రాష్ట్ర సగటు కంటే తక్కువగావే ఉంది.

జిల్లా	మొత్తం పొదుపుల్లో మహిళల సంఖ్య	సర్వేలో పాల్గొన్న వారు	రూ.25వేల లోపు ఆదాయం	రూ.25వేల నుంచి 60వేల ఆదాయం	రూ.61వేల నుంచి లక్ష వరకు	రూ.లక్షకు పైగా ఆదాయం	లక్ష లోపు ఆదాయ శాతం
రంగారెడ్డి	2,11,492	2,06,505	11,512	73,797	86,843	34,353	17
మేడ్చల్-మల్కాజ్‌గిరి	34,537	32,843	1,359	6,739	14,756	9,989	30
వికారాబాద్	1,59,046	1,55,746	9,787	60,604	51,019	34,336	22

'లక్‌పతి దీదీ' స్కీమ్ ఏమిటీ?

వాస్తవానికి ఈ పథకాన్ని తొలుత రాజస్థాన్‌లో ప్రారంభించారు. గ్రామీణ మహిళల సాధికారిత దిశగా అమల్లోకి తెచ్చారు. పొదుపు సంఘాల్లో పనిచేస్తున్న గ్రామీణ మహిళలు ఒక ఏడాదిలో అన్ని ఖర్చులు పోనూ రూ.లక్షకుపైగా సంపాదించేందుకు ప్రభుత్వం సహాయసహకారాలు అందిస్తోంది. జీవనోపాధుల కల్పనే లక్ష్యంగా మహిళలను లక్షాధికారులను చేసే ఈ స్కీమ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని మోదీ సర్కార్ నిర్ణయించింది. ఈ పథకం అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎల్ఆర్ఎల్ఎం) ద్వారా ప్రతి మహిళ రూ.లక్ష ఆదాయం ఆర్జించేలా అవసరమైన ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించడంతో పాటు స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇస్తున్నారు. నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చిన అనంతరం మహిళలకు వడ్డీ లేకుండా రూ.5లక్షల వరకు రుణం ఇవ్వనుంది. దేశవ్యాప్తంగా రెండు కోట్ల మంది మహిళలను లక్‌పతిదీదీలుగా చేసేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు కూడా చేసింది. ప్రభుత్వం ద్వారా వడ్డీ లేని రుణ ఈ పథకం ద్వారా మహిళలు అన్ని రకాల వ్యాపారులను చేసుకునేందుకు వీలుంది. ఆర్థిక క్రమశిక్షణతో ఎదిగిన పొదుపు సంఘాలను గుర్తించి వారికి మరింత రుణ సదుపాయాన్ని అందించనున్నారు.





వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం

తాండూరురూరల్, ఫిబ్రవరి24: తాండూరు మండలం అంతారం అనుబంధగ్రామం దస్తగిరిపేట్ శ్రీదేవి,భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలుఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గంగిశెట్టి శ్రీనివాస్, అనురాధ, రాఘవాచార్ శుక్రవార్, నిర్మల దంపతులు కల్యాణం జరిపించారు. అనంతర రథోత్సవం కనుల పండువగా సాగింది. సాయంత్రం స్వామివారు అశ్వవాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో వెంకటాచార్ శుక్రచార్, రాఘవాచార్, పురందరాచార్, సుధాకర్, సుబ్బారావు, రమేష్, చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీటీసీ శాంతు పాల్గొన్నారు.



రథోత్సవం

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 24 : ప్రభుత్వం నిర్దేశించిన గడువు (ఈనెల 29) లోగా సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయని రైస్‌మిల్లర్లపై చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో సీఎంఆర్ పెండింగ్‌పై రైస్‌మిల్ యజమానులు, పౌరసరఫరాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం, యాసంగి 2022-23 సంవత్సరానికి సంబంధించి రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వేగంగా మిల్లింగ్ చేసి నెలాఖరులోగా నిర్దేశిత కోటాను ఎఫ్‌సీఐకి చేరవేయాలని మిల్లర్లకు సూచించారు. నిబంధనలను ఉల్లఘించే రైస్‌మిల్లర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఎంఆర్ కేటాయింపుల్లో నెలలు గడుస్తున్నా మిల్లర్లు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని, అలసత్వాన్ని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, పౌరసరఫరాల మేనేజర్ సుగుణ, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలేశ్వర్‌గుప్త, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, మిల్లర్లు పాల్గొన్నారు.

అటవీ భూమి ఆక్రమిస్తే పోడు పట్టాలు రద్దు

● జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ధారూరు, ఫిబ్రవరి 24 : అటవీ భూములను ఆక్రమించే వారి పోడు పట్టాలు రద్దు చేస్తామని, అక్రమంగా అడవిలోకి వెళ్లే వాహనాలను సీజ్ చేస్తామని అటవీశాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. 'సంగాయపల్లి అడవిలో ఆగని నరికివేత' అనే శీర్షికతో ఈనెల 22న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. శనివారం ధారూరు రేంజ్ కార్యాలయంలో అటవీభూమిలో చెట్లను నరికి ఆక్రమిస్తున్న వారితో సమావేశం నిర్వహించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధారూరు రేంజ్ పరిధిలో ప్రభుత్వం పంపిణీ చేసిన పోడు భూముల పరిధి దాటి అడవి భూమిని ఆక్రమిస్తే, వారి పోడు పట్టాలు రద్దుచేసే అధికారం తమకు ఉందని చెప్పారు. దీనిపై త్వరలో సంగాయపల్లిలో అవగహన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆక్రమణకు గురైన అటవీ ప్రాంతాన్ని స్వాదీనం చేసుకుని మొక్కలు నాటుతామని చెప్పారు. అక్రమంగా అడవిలోకి ప్రవేశించే ట్రాక్టర్లు, జేసీబీలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే దోర్నాల్ బీట్ అధికారి సిరాజ్‌ద్దీన్ డిప్యూటేషన్‌పై డీఎఫ్‌వో కార్యాలయంలో విధులు నిర్వహించడంపై ఆయన వివరణ ఇచ్చారు. డీఎఫ్‌వో ఆఫీసులో పనులు చేసేవారు లేక అక్కడ బీట్ అధికారి సిరాజుద్దీన్ విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. అవసరమైతే దోర్నాల్ బీట్‌లో కూడా విధులకు పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రేంజర్ క్రిష్ణ, సెక్షన్ అధికారులు రాజేందర్ రెడ్డి, మోయినోద్దీన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

జడ్పీ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

వికారాబాద్, ఫిబ్రవరి 24: జిల్లా పరిషత్ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆమె పనులను పరిశీలించారు. అంతకు ముందు జడ్పీ కార్యాలయంలో ఇంజనీర్లతో సమావేశమై పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. అరవైశాతం పనులు పూర్తయినట్లు ఈఈ ఉమేష్ చెప్పారు. గ్రౌండ్‌ఫ్లోర్ పనులు మరో పది రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. అనంతరం నూతన భవన నమూనాను ఆమె విడుదల చేశారు. ఆమె వెంట సీఈవో సుధీర్ తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న సునీతామహేందర్‌రెడ్డి


సమ్మక్క, సారలమ్మ సేవలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 24 : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం మేడారం సమ్మక్క, సారలమ్మలను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కును చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సమ్మక్క, సారలమ్మలకు మొక్కుకోవడంతో బిడ్డ పుట్టిందని చెప్పారు. మహిమగల దేవతలను ప్రతి సంవత్సరం దర్శించుకుంటానని తెలిపారు.



తులాభారం సమర్పిస్తున్న స్పీకర్

రూ.20కోట్ల భూమిపై అక్రమార్కుల కన్ను



● పట్టా భూములు కాజేసేందుకు కుట్ర ● పట్టాదారులకు తెలియకుండా ధరణి స్లాట్ బుకింగ్
● తహసీల్దార్ కార్యాలయంలోని అధికారులపై రైతుల అనుమానం?

వికారాబాద్, ఫిబ్రవరి 24: కోట్లు విలువ చేసే భూమిపై కన్నేశారు అక్రమార్కులు.. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 10.20 ఎకరాల భూమిని కాజేసేందుకు కుట్ర పన్ని ఏకంగా ధరణిలో స్లాట్ బుక్ చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ధరణి విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి భూముల వ్యవహారాల్లో ఇలాంటి ఎన్నో సంఘటనలు చోటు చేసుకోగా, తాజాగా వికారాబాద్ పట్టణంలోని ఎన్నేపల్లి గ్రామానికి చెందిన రైతులు గొరిగె మల్లేశం, గొరిగె శ్రీనివాస్, గొంగుపల్లి మల్లేశం, వెంకటేష్, సువాని, గొరిగె శ్రీశైలం అనే రైతుల భూములు వారి ప్రమేయం లేకుండా... వారికి తెలియకుండానే వేరే వారికి రిజిస్ట్రేషన్ చేసేందుకు స్లాట్లు బుక్ అయ్యాయి. అయితే ఈ విషయం తెలుసుకున్న రైతులు లబోదిబోమంటున్నారు. తాతల కాలం నాటి భూములను ఇప్పుడు ఎవరో అక్రమార్కులు ఊరు.. పేరు లేకుండా ఎలా స్లాటు బుక్ చేస్తారంటూ దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జరిగిన సంఘటనపై వారు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులతో మొర పెట్టుకోగా, స్లాట్ బుక్ చేసుకున్నట్లుగా సమాచారం ఉందే తప్పా, ఎవరు చేశారనేది తమకు తెలియదని వారు చెబుతుండడంతో ఏమి చేయాలో పాలుపోక న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌తో పాటు తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందజేశారు. కాగా, తమ భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్లాట్లు బుక్ చేసిన వారు ఎవరో తెలియక తలలు పట్టుకుంటున్నారు. సర్వే నెంబర్ 208/4లో 6ఎకరాలు ఉండగా, సర్వే నెంబర్ 209లో 4.20 ఎకరాలు ఉంది. ఈ భూములను గ్రామం మాన్యాలుగా చెప్పుకుంటారు. గతంలో సరళాదేవి అనే మహిళ ఆ భూములను ఎన్నెపల్లి గ్రామానికి చెందిన రైతులకు దానం చేసినట్లుగా చెబుతున్నారు. కాగా, ఎంతో విలువైన ఆ భూములపై కన్నేసిన వారు ఇప్పుడు కాజేసే కుట్ర చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

తహసీల్దార్ కార్యాలయ అధికారి పనేనా ?

అయితే ఈ భూముల విలువ మార్కెట్లో రూ.20 కోట్ల వరకు ఉంటుంది. సరళాదేవి రైతులకు ఇచ్చిన భూములపై కొందరు కుట్ర చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారంలో తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి ప్రధాన సూత్రధారుడిగా తెరవెనక బాగోతం నడిపించినట్లుగా రైతులు అనుమానిస్తున్నారు. ఆ అధికారే ఇదంతా చేస్తున్నారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి వివరాలు పొందుపర్చకుండా స్లాట్ ఎలా బుక్ చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఊరు, పేరు లేకుండా స్లాట్ బుకింగ్ ఎలా అవుతుందంటూ వారు మండిపడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం అధికారి పాత్ర లేకుండా ఇదంతా ఎలా జరుగుతుందని వారు ప్రశ్నిస్తున్నారు.

రైతులు మా వద్దకు వచ్చారు



తమ భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఎవరో ధరణిలో స్లాట్ బుక్ చేశారని కొందరు రైతులు మా దృష్టికి తీసుకువచ్చారు. తమ భూముల రిజిస్ట్రేషన్ ఆపాలని మమ్మల్ని కోరారు. స్లాట్ బుక్ చేసిన వారు మా వద్దకు వస్తే వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలిస్తాం. అప్పటి వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిపివేస్తాం.. ఎవరు స్లాట్ బుక్ చేశారనేది మాకు కూడా తెలియదు.

- లక్ష్మీనారాయణ, తహసీల్దార్, వికారాబాద్

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఫిబ్రవరి 24 : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (బేగంపేట)లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వికారాబాద్ జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. విద్యార్థులు 01-06-2017 నుంచి 31-05-2018 మధ్యన జన్మించిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మార్చి 12 లోపు సమర్పించాలని తెలిపారు. వివరాలకు 9573859268 నెంబరులో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు డీఏవీ విద్యార్థుల ఎంపిక

తాండూరురూరల్, ఫిబ్రవరి 24 : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తాండూరు మండలంలోని కరన్‌కోట్ సీసీఐ డీఏవీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏసురత్నం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న తాండూరులోని పాత శాలివాహన డిగ్రీ కళాశాలలో అండర్-17, 16, 14 విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలు జరుగగా పాఠశాలకు చెందిన విద్యార్థులు కరణ్‌జాదవ్‌ఓవి, సరితకుమారి, గాయత్రి రన్నింగ్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆదివారం (ఈ నెల 25) నుంచి హైదరాబాద్ కొల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ చైర్మన్, జీఎం మహేన, ఆర్వో శేషాద్రి, పీఈటీ మహాదేవ్ అభినందించారు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

రూ.60కోట్లతో జుంటిపల్లి ప్రాజెక్టు అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, ఫిబ్రవరి 24: జుంటిపల్లి ప్రాజెక్టును రూ.60కోట్లతో అభివృద్ధి చేస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎన్కెపల్లి, అగ్గనూర్, జుంటిపల్లి, అక్కంపల్లి, యాలాల, నాగసముందర్, పగిడియాల్, రాస్నం గ్రామాలోట్ల ఆయన శనివారం సీసీరోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేరుస్తుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో చేసిందేమీలేదని విమర్శించారు. ప్రతీగ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఎంపీడీవో పుష్పలీల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, భీమయ్య, అక్బర్‌బాబా పాల్గొన్నారు.

మార్చి 11 నుంచి జైపూర్ కాళ్ల అమరిక

తాండూరు, ఫిబ్రవరి 24: తాండూరులో మార్చి 11, 12, 13 తేదీల్లో స్థానిక బాలాజీ మందిరంలో మార్వాడీ యువ మంచ్ ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీ యాజమాన్యం సంయుక్తంగా ఉచిత జైపూర్ కాళ్ల అమరిక శిబిరం నిర్వహిస్తున్నట్లు మంచ్ ప్రతినిధి మన్మోహన్ సారడా తెలిపారు. వికలాంగులకు కాళ్ళ అమరిక పోలియోగ్రస్తులకు క్యాలీ పర్శ అమరిక ఉంటుందని చెప్పారు. ఇదిలా ఉండగా శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మార్వాడి యువ మంచ్ ప్రతినిధులు సన్నీ అగర్వాల్, బ్రిజ్ మోహన్, కిషన్ రాటి పాల్గొన్నారు.

పాంబండ గిరి ప్రదక్షిణకు తరలిన భక్తులు

కులకచర్ల, ఫిబ్రవరి 24: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామం పాంబండ 14వ గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. పౌర్ణమి సందర్భంగా శనివారం పాంబండ గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీనెల పౌర్ణమి రోజు పాంబండ గిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు. గతనెల కంటే ఈ సారి అధికంగా మహిళా భక్తులు, శివస్వాములు పాల్గొన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అర్చకులు పాండుశర్మ శ్రీరామలింగేశ్వరస్వామి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, పూడూరు జడ్పీటీసీ మేఘమాల, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్, ఎంపీటీసీలు ఆనంద్, జ్యోతి, లక్ష్మి, నిర్వాహకులు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

సేవాలాల్, అంబాభవానీ ఆలయ వార్షికోత్సవం

పూడూరు, ఫిబ్రవరి 24 : సేవాలాల్, అంబాభవానీ ఆలయ 8వ వార్షికోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో సేవాలాల్, అంబాభవానీ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం గణపతిపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా నేడు(ఆదివారం) సేవాలాల్ బహుబండార్, అంబా భవానీ యజ్ఞహోమాలు, రేపు(సోమవారం) అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయన నిర్వహకులు పేర్కొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

బషీరాబాద్, ఫిబ్రవరి 24: వేసవి దృష్ట్యా తాగునీటి వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇబ్బందులు లేకుండా చూడాలని బషీరాబాద్ తహసీల్దార్, పంచాయతీ ప్రత్యేకాధికారి వై.వెంకటేష్ అన్నారు. మండలంలోని మైల్వార్ పంచాయతీలో శనివారం పలు వార్డుల్లో కార్యదర్శితో కలిసి గ్రామాన్ని పర్యవేక్షించారు. తాగునీటి వనరులను ఆయన స్వయంగా పరిశీలించారు. అంతకుముందు పల్లెప్రకృతి వనం, క్రీడాప్రాంగణం, శ్మశానవాటిక, సెగ్రిగేషన్ షెడ్డును సందర్శించారు. అనంతరం పంచాయతీ కార్యాలయానికి చేరుకుని రికార్డులను తనిఖీ చేశారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కార్యదర్శి నర్సింహాగౌడ్‌కు సూచించారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి గడువు పెంపు

బషీరాబాద్, ఫిబ్రవరి 24: తెలంగాణ మోడల్ స్కూళ్లలో 6, 7, 8, 9, 10 తరగతుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించినట్లు బషీరాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అల్తామాస్ జహంగీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2వ తేదీవరకు ప్రవేశాల కోసం గడువు పెంచడంపై అర్హులైన విద్యార్థులు మీసేవలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

కొడంగల్, ఫిబ్రవరి 24: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. కొడంగల్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, చదువుకున్న పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా యులు, ప్రిన్సిపాల్ శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 24: పట్టణంలోని నవీన ఆదర్శ కాన్వెంట్ పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారితోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. 30 మంది విద్యార్థులు స్వయం పరిపాలనలో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

గందరగోళంగా ఎంఈవో తీరు

● పీఆర్‌టీయూ, టీయూటీఎఫ్ నాయకుల ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బంట్వారం, ఫిబ్రవరి 24: బంట్వారం మండల విద్యాధికారి ఇటీవల అవలంబిస్తున్న తీరు ఉపాధ్యాయులను తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్నాయని బంట్వారం మండల పీఆర్‌టీయూ, టీయూటీఎఫ్ మండల అధ్యక్షులు సతీష్ కుమార్, సుదర్శన్‌లు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెలలో జరిగిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలపై రిసోర్స్ పర్సన్ల నియామకాల్లో నిబంధనలను తుంగలో తొక్కి తన ఇష్టానుసారంగా తనకు ఇష్టమైన వారిని నియమించారని ఆరోపించారు. మండలంలో అనేక మంది సీనియర్ ఉపాధ్యాయులు ఉన్న 2020 నియామకమైన అందరికన్నా జూనియర్లు అయినా ఉపాధ్యాయులను రీసోర్స్ పర్సన్‌గా నియమించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. గతంలో కూడా ఒక సంఘం మండల అధ్యక్షుడికి రీసోర్స్ పర్సన్‌ను నియమించడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇటీవల శిక్షణ కార్యక్రమానికి ఇతర రాష్ట్రాలకు రిసోర్స్ పర్సన్ల నియామకాల్లోనూ అసంబద్ధ విధానాలకు తెరలేపి గందరగోళానికి తావిస్తున్నాడని వారు ఆరోపించారు. రోజూ ఏదో ఒక ఉపాధ్యాయుడిని వెంట పెట్టుకుని తిరుగుతూ పాఠశాల విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను తెలియజేయాలని అనుకున్నా వారి ఫోన్ కాల్స్‌కు స్పందించరని, మండల వనరుల కేంద్రానికి వెళ్లినా కనీస వసతులు ఉండవని తెలిపారు. నిబంధనలు పాటించని ఎంఈవోపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఆంజనేయరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 24: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంతతను పొందుతారని పిరమిడ్ స్పిర్చ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా అంజనేయరెడ్డి అన్నారు. మండలంలోని గొట్టిముక్కుల, ద్యాచారం గ్రామాల్లో ప్రజలకు పాఠశాలల విద్యార్థులకు శనివారం ధ్యానంతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అదేవిధంగా రోగనిరోధకశక్తి పెరిగి వ్యాధులు దరిచేరవన్నారు. భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చన్నారు. ఎవరికి ఎంత వయస్సు ఉంటుందో అన్ని నిమిషాలు నిత్యం ధ్యానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, నవీన్, చెన్నయ్య, బాబు, శ్రీనివాస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానాన్ని దినచర్యగా మార్చుకోవాలి

పరిగి: నిత్యజీవితంలో ధ్యానాన్ని దినచర్యగా మార్చుకోవాలని పిరమిడ్ స్పిర్చ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బి.ఆంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త నవీన్‌లు అన్నారు. పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నస్కల్, బర్కత్‌పల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకిష్టారెడ్డి, చెన్నయ్య, శ్రీనివాస్‌బాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

4న ఎస్పీ కార్యాలయ ముట్టడి

పరిగి, ఫిబ్రవరి 24: భూవివాదంలో జోక్యం చేసుకుని అర్హులకు అన్యాయం చేస్తున్న పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని కోరుతూ మార్చి 4న జిల్లా ఎస్పీ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.చంద్రయ్యలు తెలిపారు. పరిగిలో డీఎస్పీ వైఖరిని నిరసిస్తూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కె.చంద్రయ్య, అంజిరావణ్, అయూబ్, అమీర్, హబీబ్, రఘురామ్, రాంచంద్రయ్య, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 24 : కేంద్రప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అవుషాపూర్‌లో శనివారం ఆయన పంచాయతీ కార్మికులకు లేబర్‌కార్డులను పంపిణీ జేశారు. కేంద్రప్రభుత్వం కార్మికులకు శ్రామిక్‌కార్డుల ద్వారా రెండు లక్షల భీమా అందజేస్తుందని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్రమోడీ దేశవ్యాప్తంగా కార్మికులకు శ్రామిక్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం బడుగు బలహీనవర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పూడూరు ఎంపీడీవోగా పాండు

పూడూరు, ఫిబ్రవరి 24: పూడూరు ఎంపీడీవోగా డి.పాండు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఉమాదేవి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో కొడంగల్ నుంచి డి.పాండు బదిలీపై పూడూరుకు వచ్చారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కీసర రూరల్, ఫిబ్రవరి 24: నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తున్నామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని రాంపల్లి, రాజ్‌సుఖ్‌నగర్‌లో రూ.43లక్షలతో రెండు అంగన్‌వాడీ భవనాలు, రాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో రూ.31.50లక్షలుతో అదనపు తరగతి గదుల నిర్మాణం, 11, 12 వార్డుల్లో రూ.32లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, మొత్తం రూ.కోటి 6లక్షలా 50వేలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజేందర్‌కుమార్, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



కట్ట మైసమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శామీర్‌పేట, ఫిబ్రవరి 24: మండలంలోని బొమ్మరాశిపేట గ్రామ పెద్దచెరువు వద్ద గ్రామ నాయకుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం శ్రీకట్ట మైసమ్మ అమ్మవారి నూతన విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆ ఆలయానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, గ్రామ నాయకులు, భక్తులు, మహిళలు అత్యధికసంఖ్యలో విచ్చేసి కట్ట మైసమ్మ అమ్మవారును అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలను చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నక్క ప్రభాకర్‌గౌడ్‌ను గ్రామ నాయకులు ఘనంగా సన్మానించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

తాండూరు రూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని చెంగోల్ గ్రామంలోని బీసీ కాలనీలో రూ.15లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్లు, మురుగు నీటి కాల్వల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన గేటు నుంచి రాములమ్మ ఇంటి వరకు రూ.10లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పూర్తవగా మరో రూ.5లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించనున్నట్లు ఎంపీటీసీ గౌడి రత్నమాలరాము యాదవ్ తెలిపారు.

తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలి

పరిగి, ఫిబ్రవరి 24: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పరిగి ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. పరిగి మండల పరిషత్‌లో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. గ్రామాల్లో పైపులైన్ల లీకేజీలు ఉంటే బాగు చేయించాలని సూచించారు. అదనపు పైపులైన్‌లు ఏర్పాటు అవసరముంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ బి.హరిప్రియప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి, ఎంపీవో దయానంద్, మిషన్ భగీరథ డీఈఈ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేణుగోపాల స్వామి రథోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 24: మండల పరిధి ఎదులాబాద్‌లోని రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఘనంగా స్వామివారి రథోత్సవం కార్యక్రమం జరిగింది. ఉదయం స్వామివారికి పుణ్యాహవాచనము, గీతా హవనము, ద్వైవాసుర్య, శ్రద్ధాత్రయ మోక్షసన్యాసయ ఓగముల హవనము, మహాపూర్ణాహుతి, మంత్రపుష్పము, ఆశీర్వచనము, పండిత సన్మాన కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన విమానరథోత్సవంపై అమ్మవార్లను స్వామివారిని ప్రతిష్ఠించారు. గోవిందా నామస్మరణతో ఆలయ వీధులు మారోమ్రోగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యే పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలి వరకు రథోత్సవంపై స్వామివారిని ఊరేగించి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు స్వామివారికి పూలు, పండ్లు, కొబ్బరికాయాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయధర్మకర్తలు అంబారిపేట అప్పాలాచార్యులు, రాంప్రసాద్, వరదరాజులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కమిషనర్‌కు సన్మానం

శామీర్‌పేట, ఫిబ్రవరి 24: తూంకుంట మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా విచ్చేసిన వెంకట్‌గోపాల్‌ను శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్‌చైర్‌పర్సన్ పన్నాల వాణీవీరారెడ్డి, కౌన్సిలర్లు సురేష్, హరిబాబు, నర్సింగ్‌రావుగౌడ్, కౌన్సిలర్ భర్త భరత్, తదితర నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మున్సిపల్ అభివృద్ధికి బాధ్యతగా కృషిచేయాలని చైర్మన్ కమిషనర్ కోరారు.

సీఎంఆర్‌లో ఆల్ ఇండియా నెట్‌బాల్ పోటీలకు జట్ల ఎంపిక

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 24 : గుండ్లపోచంపల్లి మున్సిపల్ కండ్లకోయ పరిధిలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జేఎన్టీయూ ఆల్ ఇండియా నెట్ బాల్ పోటీలకు జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్‌చైర్మన్ సీహెచ్ భూపాల్‌రెడ్డి, సెక్రటరీ సీహెచ్ శ్రీశైలంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. జేఎన్టీయూ స్పోర్ట్ బోర్డు కార్యదర్శి దిలీప్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర నెట్‌బాల్ సెక్రటరీ ఎస్.సోమేష్‌కుమార్‌చే ఎంపికలు నిర్వహించారు.

ఒలంపియాడ్‌లో సుదీక్ష విద్యార్థుల ప్రతిభ

పరిగి, ఫిబ్రవరి 24: ఏఐఎంఎస్ ఒలంపియాడ్ అకాడమి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో పరిగిలోని సుదీక్ష ఇండస్‌వాల్యూ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ పాఠశాల నుంచి 101మంది విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షలు రాశారు. 25మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ప్రతిభచాటిన విద్యార్థులకు శనివారం పాఠశాలలో ప్రిన్సిపాల్ పరిమల, డైరెక్టర్ వీరేశం ఆధ్వర్యంలో విద్యార్థులను సత్కరించి ధృవీకరణ పత్రాలను అందజేశారు.

వైభవంగా తిరుమలదేవుడి జాతర

దౌల్తాబాద్, ఫిబ్రవరి 24: గోకఫస్లాబాద్‌లో వెలసిన తిరుమల దేవుడి జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం భక్తులు స్వామివారికి అభిషేకం, హోమం తదితర పూజా కార్యక్రమాలతో ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. గోకఫస్లాబాద్ ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షిప్తంగా..

● **పరిగి:** మిట్టకోడూరులో శ్రీశ్రీశ్రీ సద్గురు మాణిక్‌ప్రభు వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. గ్రామంలో రామాయణం, మునిరంగస్వామి వీధినాటకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తుల సందడి నెలకొంది.

● **తాండూరురూరల్:** అంతారంలో జాతీయ ఉపాధిహామీ కింద చేపట్టిన పలు పనులకు నాలుగు రోజులపాటు ఆడిట్ అధికారులు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా శనివారం అంతారంలో ప్రత్యేకాధికారి విజయేందర్, పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్, సోషల్ ఆడిట్ అధికారి డీఆర్పీ యాకయ్య సిబ్బందితో కలిసి గ్రామసభ నిర్వహించారు.

● **పెద్దేముల్:** హన్మాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు లొంక నర్సింహులు గురుస్వామి ఆధ్వర్యంలో శివస్వాములు, భక్తులు ప్రతీఏటా శ్రీశైలం వెళ్తుంటారు. ఈసారి కూడా శివస్వాములతో పాటు మొత్తం 150మంది గ్రామస్తులు శ్రీశైలంకు బయలుదేరగా విషయం తెలుసుకున్న నర్సింహులు స్నేహితులు రహీం, అజీజ్ శ్రీశైలంలు స్వాములు, భక్తులకు ఫలహారాలు అందజేశారు.

● **తాండూరు:** రైతువ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని రైతాంగం పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం కాల్పులు జరుపుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్ బాలమల్లేష్ ఆరోపించారు. రైతులపై కాల్పులను నిరసిస్తూ ఫిబ్రవరి 26న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ ముందు జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

● **కీసర:** విద్యార్థులు చదువుతో పాటు సాకేతింక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ టి. హరిశ్చంద్ర ప్రసాద్ అన్నారు. రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో రెసోనెన్స్ ఫేర్-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ టి. హరిశ్చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, సాకేంతిక పరిజ్ఞానం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ ఆవిష్కరణలు చైర్మన్ టి. హరిశ్చంద్ర ప్రసాద్ పరిశీలించి బహుమతులు అందజేశారు.

● **కొడంగల్:** కొడంగల్‌లోని మహాదేవ శివాలయంలో శనివారం శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతంతో అభిషేకం, విశేష అలంకరణ, శివాష్టోత్తర శతనామవళి, పంచాక్షరీ స్తోత్రం, శరణఘోష, మంగళహారతులు తదితర పూజలు నిర్వహించారు. అనంతరం కొడంగల్ పట్టణానికి చెందిన వడ్డె కిష్టప్ప ఆధ్వర్యంలో శివస్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు.

● **నవాబుపేట:** చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవరాంపల్లి, చీమలదరి పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షాప్యాడ్‌లు పంపిణీ చేశారు.

● **మోమిన్‌పేట్:** ఎన్కతల గ్రామానికి చెందిన రమేశ్‌గౌడ్ ఈనెల 2 నుంచి అయోధ్యలో చేపట్టిన అన్నదానంలో వలంటీర్‌గా వెళ్లినట్లు తెలిపారు.

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీలోని ఆర్జీకే కాలనీలో నివాసముండే సంజయ్ కిడ్నీలు పాడై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. విషయం తెలుసుకున్న స్ఫూర్తి ఆర్గనైజేషన్ నిర్వాహకుడు కుంటోళ్ల యాదయ్య, రాజేష్‌కు వివరించడంతో పోచారం మున్సిపాలిటీ ఎస్సీసెల్ నాయకుడు రాజేష్ స్పందించారు. ఆర్గనైజేషన్ నిర్వాహకులతో కలిసి రూ.25వేల నగదును సంజయ్ నివాసానికి వెళ్లి అందజేశారు.

కులకచర్ల: అల్లాపూర్ తండాలో సయోధ్య కృతి ట్రైనింగ్ కం ప్రోడక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో గిరిజన మహిళల కోసం నాబార్డు ఎంబ్రాయిడరీ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్‌నాయక్ ప్రారంభించారు. 15 రోజుల శిక్షణ అనంతరం మహిళలకు సర్టిఫికేట్లతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

పరిగి/కొడంగల్: రంగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆదివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని మండల ఏఈ ఖాజా తెలిపారు. అదేవిధంగా కొడంగల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నవీన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **కీసర:** సంకల్ప సిద్ధిగా పేరుగాంచిన చీర్యాల్ శ్రీ లక్ష్మీ నరసింహ్మ స్వామి ఆలయ ఆవరణలో శ్రీశ్రీశ్రీ చీర్యాల గంగా భ్రమరాంబికా సమేత మల్లిఖార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీ నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్రైం కార్నర్

చిన్నారులను విక్రయిస్తున్న ముఠా అరెస్టు



పోలీసులు అదుపులోకి తీసుకున్న ముఠా సభ్యులు

కీసర రూరల్, ఫిబ్రవరి 24: పసికందును విక్రయిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్న ఘటన శనివారం మేడ్చల్ జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య కథనం ప్రకారం.. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడ(బండ్లగూడ)లో నివాసముంటున్న హెప్సిబా, అనంతపురంనకు చెందిన సనా అక్రమ సంపాదన కొరకు చిన్నారులను విక్రయించటాన్ని వృత్తిగా ఎంచుకున్నారు. ఈ క్రమంలో డబ్బుల ఆశచూపి ఏపీలోని నంద్యాల, యాదవవాడకు చెందిన మీసాల ప్రసన్నను నగరానికి రప్పించారు. ఆమెకు నాలుగు మాసాల వయస్సున్న వెంకటలోకేష్ అనే కుమారుడు ఉన్నాడు. తన బిడ్డను విక్రయిస్తే డబ్బులు ఇస్తామని ఆమెకు ఆశజూపారు. తన తమ్ముడు ప్రహ్లాద, అత్త బాలనర్సమ్మ(లక్ష్మి)ను వెంట తీసుకుని, అహ్మద్‌గూడలోని హెప్సిబా ఇంటికి చేరుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కీసర పోలీసులు, మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ పోలీసులు, జిల్లా శిశు సంరక్షణ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. చిన్నారిని విక్రయించేందుకు వేచిఉన్న చిన్నారి తల్లి ప్రసన్న, ఆమె తమ్ముడు ప్రహ్లాద, అత్త బాల్‌నర్సమ్మ, సన డ్రైవర్ భానుకుమార్‌తో పాటు హెప్సిబా, సనాను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా హెప్సిబా, సనా కలిసి ఆర్థిక అవసరాలు ఉన్న వారిని ఎంపిక చేసుకుని వారి చిన్నారులను కొనుగోలు చేసి, విక్రయిస్తుంటారని వెల్లడించారు. అందులో భాగంగా రూ.4.50లక్షలకు వెంకటలోకేష్‌ను అమ్మకానికి పెట్టినట్లు వారు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. సంరక్షించిన శిశువును నగరంలోని శిశువిహార్‌లో అప్పగించారు.

తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌కు పాముకాటు



చికిత్స పొందుతున్న నరేందర్



నరేందర్‌ను కాటేసిన పాము

తాండూర్ రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా తాండూర్ తహసీల్దార్ కార్యాలయంలో జినుగుర్తి గ్రామానికి చెందిన పిట్ల నరేందర్ రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కార్యాలయంలో శనివారం సాయంత్రం రికార్డు గదికి తాళం వేసేందుకు వెళ్లగా లోపలికి వచ్చిన ఓ కట్లపాము నరేందర్ కాళ్లకు కాటేసింది. గమనించిన నరేందర్ వెంటనే అప్రమత్తమై పామును చంపేశాడు. నరేందర్ కేకలు వేయడంతో కార్యాలయంలో ఉన్న మరో రికార్డు అసిస్టెంట్ బాబురావు, సర్వేయర్ మహేందర్ తోటి సిబ్బంది పాముకాటుకు గురైన నరేందర్‌ను వెంటనే చికిత్స కోసం తాండూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నరేందర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఎంఈవో, వ్యవసాయ శాఖ, ఐకేపీ కార్యాలయాల చుట్టూ ముళ్ల కంప చెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ముళ్ల కంప చెట్లు ఉండటంతో కిటికీల్లో నుంచి వచ్చిన కట్ల పాము కాటు వేసింది. దీంతో అధికారులు భయాందోళనకు గురవుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పెద్దేముల్, ఫిబ్రవరి 24: ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం సదాశివపేట నుంచి తాండూరుకు బయల్దేరింది. మార్గమధ్యలో పెద్దేముల్ సమీపంలోకి రాగానే కోట్‌పల్లి ప్రాజెక్టు ఆయకట్టు కాలువపై గల కల్వర్టును బస్సు ఢీకొట్టింది. ఆటోను తప్పించబోయి అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. అయితే కల్వర్టును ఢీకొన్న బస్సు పక్కనే కాల్వలో పడిఉంటే పెను ప్రమాదం సంభవించేది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో కల్వర్టును ఢీకొట్టిన బస్సు ఆగిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న సుమారు 40మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఇద్దరు ప్రయాణికులకు మాత్రం స్వల్పగాయాలయ్యాయి. ప్రయాణికులందరినీ మరో ఆర్టీసీ బస్సులో గమ్యస్థానాలకు చేర్చారు.


కలప లారీ పట్టివేత

ధారూరు, ఫిబ్రవరి 24: అక్రమంగా కలపను తరలిస్తున్న లారీని సీజ్ చేశామని ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ధారూరు సమీపంలోని కోట్‌పల్లి చౌరస్తా వద్ద శనివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానంతో లారీని తనిఖీ చేశారు. లారీ అనుమతి పత్రాలు లేకపోగా కలపను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు లారీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ అల్లాబక్షపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పెద్దేముల్‌లో ఇసుక ట్రాక్టర్..

పెద్దేముల్, ఫిబ్రవరి 24: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు. మండలంలోని రేగొండి గ్రామసమీపంలోని వాగు నుంచి ఇసుక తరలింపునకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. అయితే రూ.600చెల్లిస్తే ఒక ట్రాక్టర్‌కు అనుమతి ఉంది. కాగా, జీనిగె ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి తన ట్రాక్టర్‌కు ఇసుక పర్మిట్ తీసుకోగా ఇంజిన్ నంబర్ మాత్రమే ఉంది. ట్రాలీకి నంబర్ లేదు. గమనించిన పోలీసులు ఇసుక తరలించే ట్రాక్టర్ ట్రాలీ నంబర్ ట్రాలీకి లేకపోవడంతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. రేగొండి గ్రామ సమీపంలో ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్‌కు అప్పగించారు. మొదటిసారి కావడంతో రూ.5వేల జరిమానా విధించామని తహసీల్దార్ తెలిపారు. డీడీ చెల్లించి ట్రాక్టర్‌ను తీసుకెళ్లాలన్నారు.

విద్యార్థి లక్ష్య సాధనకు ఇంటర్మీడియట్ కీలకం



మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

వికారాబాద్, ఫిబ్రవరి 24: విద్యార్థి లక్ష్య సాధనకు ఇంటర్మీడియట్ కీలకమని, ఈ దశలో ఇష్టపడి క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరగలరని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు నూలి శుభప్రద్ పటేల్ అన్నారు. వికాస్ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ఆయన సీనియర్, జూనియర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫేర్‌వెల్ పార్టీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భవిష్యత్తులో ఏస్థాయికి ఎదిగినా తల్లిదండ్రులు, విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను మరువరాదన్నారు. 23సంవత్సరాలుగా వికారాబాద్‌లో వికాస్ కళాశాల ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యం సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, వికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన లక్ష్మారెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 24: తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను ఆపార్టీ రాష్ట్ర నాయకుడు, ఘట్‌కేసర్‌కు చెందిన మారం లక్ష్మారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కొంత కాలంగా మోకాళ్లకు శస్త్రచికిత్స కారణంగా ఇంటి వద్దే ఉన్న ఆయన నగరంలోని కోదండరాం నివాసానికి వెళ్లి కలిశాడు. పార్టీ కార్యక్రమాల్లో యథావిధిగా పాల్గొంటానని తెలిపిన ఆయన పార్టీ కార్యకలాపాలపై చర్చించినట్లు తెలిపారు.